సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

ప్రశ్నిస్తే పరువునష్టం దావా వేస్తారా?

టీజీపీఎస్సీ తీరుపై బీఆర్ఎస్వీ నాయకుల ఆగ్రహం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 13 : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి గ్రూప్-1 అవకతవకలపై ప్రశ్నించినందుకు టీజీపీఎస్సీ పరువు నష్టం దావా నోటీసులు ఇవ్వడాన్ని కేయూ బీఆర్ఎస్వీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం కేయూలో జరిగిన సమావేశంలో రాష్ట్ర సీనియర్ నాయకులు కత్తెరపల్లి దామోదర్, పాలమాకుల కొమురయ్య, కేయూ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి జెట్టి రాజేందర్ మాట్లాడుతూ.. తెలుగు మీడియంలో గ్రూప్-1 పరీక్ష రాసిన అభ్యర్థులకు జరిగిన అన్యాయం విషయంలో టీజీపీఎస్సీ స్పందించి న్యాయం చేయాలని రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేసినందుకు ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. టాప్ 500లో ఒక్క తెలుగు మీడియం అభ్యర్థి కూడా లేక పోవడం ఏంటని, 46 పరీక్షా కేంద్రాల్లో కేవలం 2 సెంటర్లలోనే 74 మంది టాపర్లు ఉన్నారన్నారు. కొన్ని సెంటర్లలో 10 శాతం పాస్ అయితే, ఇంకొన్ని సెంటర్లలో 0.2 శాతం పాస్ అయ్యారని, పక్కపక్క రూల్ నంబర్లకు సుమారు 1300 మందికి ఒకే రకమైన ఫలితాలు ఎలా వస్తాయి? అని ప్రశ్నించారు. కొందరికి 1, 2, 3, 6, 9 మార్కులు రావడం ఏంటని ప్రశ్నిస్తే నోటీసులు ఇవ్వడం, కేసులు పెడతామని బెదిరించడం దారుణమన్నారు. బీఆర్ఎస్ నాయకులకు కేసులు, ఉద్యమాలు కొత్త కాదని, టీజీపీఎస్సీ విద్యార్థి, నిరుద్యోగుల పక్షాన కొట్లాడుతున్న రాకేష్‌రెడ్డికి అందరి మద్దతు ఉంటుందన్నారు. బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ అరూరి రంజిత్‌కుమార్, నాయకులు కొనుకటి ప్రశాంత్, సాగర్, రమేశ్, సురేశ్ పాల్గొన్నారు.

కుడా మాజీ చైర్మన్‌కు పరామర్శ

వెంకటమ్మ భౌతికాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

హనుమకొండ, ఏప్రిల్ 13 : బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి తల్లి వెంకటమ్మ (95) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. బీఆర్ఎస్ నేతలు ఆదివారం యాదవరెడ్డి స్వగ్రామమైన సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని వెలిశాలకు వెళ్లి వెంకటమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, కేతిరెడ్డి వాసుదేవారెడ్డి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, నాయకులు బీరవెల్లి భరత్ కుమార్‌రెడ్డి, బుద్ద వెంకన్న, పోలెపల్లి రామ్మూర్తి, బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, కొడగాని రాంబాబు, మోటె చిరంజీవి, గాయకుడు ఏపూరి సోమన్న, జిల్లా నాయకులు రెంటాల కేశవరెడ్డి, ఎల్లావుల లలితాయాదవ్ ఉన్నారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

మర్రి యాదవరెడ్డిని పరామర్శిస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మహిళా మండలి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

వరంగల్, ఏప్రిల్ 13 : మహేశ్వరి మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం భద్రకాళీ రోడ్డులోని మారుతి ఫంక్షన్ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌లోని యశోద, కూరపాటి ఆస్పత్రి వైద్యులు సుమారు 400 మందికి పరీక్షలు చేశారు. మహిళా మండలి కార్యదర్శి సరిత, ప్రతినిధులు సుహిత, చందు సోనీ, మీనా, అనురాధ, సోనీ మలానీ పాల్గొన్నారు.

కమలాపూర్ జీపీలో అధికార దుర్వినియోగం

- అడ్డగోలుగా ఇండ్ల అనుమతులు
- ఒక్కో ఇంటికి రూ.లక్ష వసూలు
- ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాలే అధికారులకు ఆదాయ వనరు
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు

కమలాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

కమలాపూర్, ఏప్రిల్ 13 : ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు తమకున్న అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా ఇండ్ల అనుమతులు ఇస్తూ అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్రభుత్వ భూముల్లోని ఇండ్ల నిర్మాణాలను ఆదాయ వనరుగా మార్చుకుంటూ ఏజెంట్లను పెట్టుకుని రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. ప్రశ్నించిన వారికి ఎరవేస్తూ దర్జాగా దందా చేస్తున్నారనే విమర్శలున్నాయి. కమలాపూర్ గ్రామపంచాయతీలో పర్మిషన్ కోసం ఒక్కో ఇంటికి రూ.యాభై నుంచి లక్ష కుపైగా ఏజెంట్లను పెటుకొని వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అక్రమ నిర్మాణాల పేరిట ప్రభుత్వం కూల్చివేతలు చేసిన ఇండ్లకు సైతం అనుమతులు జారీ చేసినట్లు తెలిసింది. రెండు నెలల క్రితం ఓ విలేకరి ఇండ్ల అనుమతులు, గ్రామపంచాయతీలో నిధుల వివరాలపై సమాచార హక్కు చట్టం కింద వివరాలు సేకరించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై కలెక్టర్ విచారణకు ఆదేశించగా, ఓ మండల స్థాయి అధికారి మామూళ్లు తీసుకుని కొంతకాలంగా విచారణను తొక్కిపెడుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. గ్రామంలోని ఓ ఇంటికి అన్ని అనుమతులు ఉన్నా యాజమాన్య ధ్రువీకరణ పత్రం జారీకి రూ.24వేలు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇండ్ల రిజిస్ట్రేషన్ చేసుకుని యాజమాన్య మార్పిడీ కోసం దరఖాస్తు పెట్టుకుంటే మామూళ్లు ముట్టనిదే పని చేయడం లేదు. ఏ పని కావాలన్నా ఏజెంట్లను కలవాల్సిందేనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు వార్డుల్లో వీధి లైట్లు, తాగునీటి బోరింగులు రిపేర్ చేయాలని ప్రజలు దరఖాస్తు ఇస్తే నిధుల్లేవు అంటూ అధికారులు దబాయిస్తున్నట్లు తెలిపారు. పైపులైన్ల మరమ్మతులు, వీధిలైట్లు, టెంట్ హౌస్ సామగ్రి ఇలా ఖర్చులు చూపిస్తూ అడ్డగోలుగా బిల్లులు పెట్టుకుంటూ వేలకు వేలు కాజేస్తున్నారనే ఆరోపణలున్నాయి. జీపీలో నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మాట్లాడుతున్న రాజేశ్

కాంగ్రెస్‌కు ఏపీలో పట్టిన గతే రాష్ట్రంలోనూ ఖాయం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 13 : స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించకుంటే తెలంగాణలో హస్తం పార్టీకి ఆంధ్రప్రదేశ్‌లో పట్టిన గతే పడుతుందని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్ది రాజేశ్ హెచ్చరించారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో ఆదివారం జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార సభలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహ్మద్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు మానుక సతీశ్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు నడిపల్లి శ్రీధర్‌రావు, జనగామ జిల్లా అధ్యక్షుడు ఏషబోయిన రమేశ్, హనుమకొండ జిల్లా నాయకులు నరేశ్, అనిల్, మహిళా నాయకురాలు మమత పాల్గొన్నారు.

తాగు నీళ్ల కోసం గ్రామస్తుల ఆందోళన

ధర్మసాగర్‌లోని మిషన్ భగీరథ నీటి శుద్ధీకరణ కేంద్రం ఎదుట ధర్నా

ధర్మసాగర్, ఏప్రిల్ 13 : రిజర్వాయర్ చెంతనే ఉన్న ధర్మసాగర్ గ్రామ ప్రజలు దూపకేడుస్తున్నారు. ఆదివారం తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామంలోని మిషన్ భగీరథ నీటి శుద్ధీకరణ కేంద్రం వద్ద గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటింటికి శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేయాలనే ఉద్దేశంతో ధర్మసాగర్ రిజర్వాయర్ కట్ట కింది భాగంలో మిషన్ భగీరథ నీటి శుద్ధీకరణ కేంద్రం ఏర్పాటు చేసింది. ఇక్కడి నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సగభాగం వరకు తాగు నీరు సరఫరా చేస్తున్నారు. ఇక్కడి వరకు బాగున్నా ఈ కేంద్రం నుంచి ధర్మసాగర్ గ్రామస్తులకు సరిపడా నీటి సరఫరా జరగడం లేదు. గ్రామంలోని వాటర్ ట్యాంక్‌కు నీళ్లు ఎక్కించే పైప్‌లైన్‌కు గేట్‌వాల్వ్‌ను ఏర్పాటు చేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని నెలల నుంచి తమకు తాగు నీళ్లు సరిపోవడం లేదని మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేక పోవడంతో ఆందోళనకు దిగారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు సరిపోయేలా మిషన్ నీళ్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ప్రభుదేవ్, బొడ్డు భరత్, కొలిపాక రమేశ్, వినేశ్, రమణాకర్, మల్లిక్, విప్లవ్, ప్రవీణ్‌కుమార్, సునీల్, బాబు, కన్ని, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ మండల కేంద్రంలోని మిషన్ భగీరథ నీటి శుద్ధీకరణ కేంద్రం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

ఆత్మకూరు, ఏప్రిల్ 13 : తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బీసీ బిల్లులను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఢిల్లీలో 13 రోజులుగా బీసీ ఆజాదీ జేఏసీ చైర్మన్ బత్తుల సిద్ధేశ్వర్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను కేంద్రం విరమింపజేసి, డిమాండ్లను అంగీకరించాలని జిల్లా ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని నాగయ్యపల్లిలో ఆయన మాట్లాడుతూ.. గత 13 రోజులుగా సిద్ధేశ్వర్ ఆమరణ దీక్ష చేయడం వల్ల ఆరోగ్యం క్షీణించిందని, ఆయనకు ఏదైనా జరిగితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. బీసీ నాయకుడు చేస్తున్న దీక్షపై స్పందించకపోవడం సిగ్గుచేటని, వెంటనే కేంద్రం దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టి, బీసీ బిల్లులను ఆమోదించాలన్నారు. కార్యక్రమంలో దళిత బహుజన ప్రజాసంఘాల నాయకులు గిన్నారపు ప్రసంగి, మోరె ఐలయ్య, కొమ్మాల భిక్షపతి యాదవ్, మాదాసి భిక్షపతి, మాదాసి సూరయ్య, గిన్నారపు కుమారస్వామి, మాదాసి బక్కయ్య పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న బండా ప్రకాశ్

చిన్నారులకు గ్రామీణ ఉత్పత్తులను అందించాలి

మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 13 : వీలైనంతవరకు సేంద్రియ ఎరువులతో పండించిన పంటలను ప్రతిరోజు ఆహారంలో భాగంగా చేసుకోవాలని, జంక్ ఫుడ్ కాకుండా చిన్నారులకు పోషక విలువలు కలిగిన గ్రామీణ ఉత్పత్తులను అందించాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో ప్రకృతి-గ్రామీణ ఉత్పత్తుల సంతను ప్రారంభించారు. తెలంగాణ గ్రామ భారతి అధ్యక్షురాలు సూర్యకళ, ప్రముఖ సామాజికవేత్త, మిల్లెట్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్, సంస్థ వరంగల్ జిల్లా బాధ్యులు అజిత్‌రెడ్డి, తోట ఆనందం, అనిత, సారయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చల్లా పరామర్శ

మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

దామెర, ఏప్రిల్ 13 : మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కౌటం మోహన్ కుమారుడు అయాన్స్(8) అనారోగ్యంతో కొద్దిరోజుల క్రితం మృతి చెందగా, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అతడి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. ఇదే గ్రామానికి చెందిన గజ్జి చిరంజీవి అనారోగ్యంతో మృతి చెందగా, కుటుంసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గండు రామకృష్ణ, మాజీ సర్పంచ్ మేడిపల్లి సాంబయ్య, చెక్క సుధాకర్ పాల్గొన్నారు.

రజతోత్సవాన్ని విజయవంతం చేయాలి

పరకాల ఏప్రిల్ 13 : ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని మండలాధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూధన్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవ మహా సభను పండుగలా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, ఏప్రిల్ 13 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఈసీ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8.30 నుంచి 10.30గంటల వరకు నాగేంద్రనగర్, జూలైవాడ ఏరియాల్లో, వడ్డేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 10గంటల వరకు వడ్డేపల్లి, విజయ్ పాల్‌కాలనీ, రాఘవేంద్రనగర్ కాలనీ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మడికొండ, ఏప్రిల్ 13 : గ్రేటర్ 64వ డివిజన్ టేకులగూడెం గ్రామంలో దర్గా పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని, పంటను అమ్మిన రెండు, మూడు రోజుల్లో డబ్బులు అందేలా ఆన్‌లైన్ చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, డీసీవో సంజీవరెడ్డి, ఏవో సంతోష్, తహసీల్దార్ బావ్‌సింగ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, కాజీపేట మండలాధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మెట్టుగుట్ట శివాలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, నాయకులు కుర్ల మోహన్, నీలం రజినీ పాల్గొన్నారు.

అంబేద్కర్ అభయహస్తం ప్రారంభించాలి

మడికొండ, ఏప్రిల్ 13 : అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రతి దళిత, గిరిజన కుటుంబానికి రూ.12 లక్షలు ఇచ్చే అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని ప్రారంభించాలని, చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని దళిత, గిరిజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొల్లికొండ వీరేందర్, ప్రధాన కార్యదర్శి భూక్యా సాంబయ్య కోరారు. కాజీపేట మీడియా పాయింట్‌లో దళిత, గిరిజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఓట్లను దండుకొని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నాడని విమర్శించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దళిత సంక్షేమం కోసం 2023-24లో రూ.21,072 కోట్లు కేటాయిస్తే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 2024-25లో కేవలం రూ.7,638 కోట్లు కేటాయించిందని, గిరిజన సంక్షేమం కోసం గత ప్రభుత్వం రూ.4,365 కోట్లు కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.3,969 కోట్లు మాత్రమే కేటాయించినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ద్వారా విదేశాల్లో చదువుతున్న దళిత, గిరిజనుల విద్యార్థుల బకాయిలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా తక్షణమే అంబేద్కర్ అభయహస్తం పథకం ప్రారంభించాలని, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ రెండో దఫా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బెదరకోట రంజిత్, వినయ్, గబ్బెట శ్రీను, మంద శ్రీనివాస్, పడిదల శేఖర్, కుమార్, విజయ్ పాల్గొన్నారు.

సీడీని ఆవిష్కరించిన అంపశయ్య నవీన్

హనుమకొండ, ఏప్రిల్ 13 : భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనను కొనియాడుతూ సమాజ కవి, ప్రజా కళాకారుడు డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు రచించి స్వరపరచిన 'బాబా సాహెబ్ పుట్టిన రోజు బడుగు జీవులకు పండుగ రోజు దండుగ కదలి దళిత బహుజనులు పండుగ చేసుకోవాలండీ' అనే గీతం ఆడియో సీడీని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ హనుమకొండలోని స్వగృహంలో ఆదివారం ఆవిష్కరించారు. అంబేద్కర్‌పై వల్లంపట్ల రచించిన గీతాన్ని ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా సంగీతం సమకూర్చడం వినూత్న ప్రక్రియగా కొనియాడారు. వల్లంపట్ల ఆర్ట్స్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి వల్లంపట్ల శ్యాంసుందర్, శశికిరణ్, సామాజిక కార్యకర్త నల్లమారి రమేశ్, మేడి సురేశ్ పాల్గొన్నారు.

27న రాష్ట్ర స్థాయి పారా తైక్వాండో పోటీలు

సమావేశంలో పాల్గొన్న తైక్వాండో అసోసియేషన్ సభ్యులు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 13 : ఈ నెల 27న రెండో రాష్ట్ర స్థాయి పారా తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు పారా తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ దిలీప్‌కుమార్ తెలిపారు. అ సోసియేషన్ ఆధ్వర్యం లో జనరల్ బాడీ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మే నెలలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్లు వెంకటేశ్(రంగారెడ్డి), ఎల్లావుల గణేశ్‌యాదవ్ (వరంగల్), దిలీప్ (హనుమకొండ), భాస్కర్(జనగామ), ఎల్లావుల గౌతమ్‌యాదవ్ (వరంగల్), వెంకటేశ్ (ఖమ్మం), కుమార్(అదిలాబాద్), మనోజ్(నిజామాబాద్), అజారుద్దీన్(మహబూబ్‌నగర్), చిరంజీవి(హైదరాబాద్) పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వ విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

కేయూలో జార్జిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 13 : బీజేపీ ప్రభుత్వ విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు అన్నారు. జార్జిరెడ్డి 53వ వర్ధంతి కాకతీయ యూనివర్సిటీలో జరిగింది. యూనివర్సిటీ రెండో గేటు వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు ప్రారంభించారు. అనంతరం మొదటి గేటు వద్ద జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానం విశ్వవిద్యాలయాల స్వతంత్ర ప్రతిపత్తికి వ్యతిరేకమైనదని విమర్శించారు. వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్, జిల్లా కోశాధికారి పవన్, కమిటీ సభ్యులు గణేశ్, రాకేశ్ పాల్గొన్నారు.

50 ఏళ్ల తర్వాత కలుసుకున్న ప్రభుత్వ ఎల్బీహెచ్ఎస్ పూర్వవిద్యార్థులు

ప్రభుత్వ ఎల్బీహెచ్ఎస్‌లో అపూర్వ సమ్మేళనం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 13 : 1974-75లో ఎల్బీహెచ్ఎస్‌లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక రిటైర్డ్ ఎస్ఐ నర్సయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. వారికి విద్యాబోధన చేసిన గురువులు పాండురంగాచారి, ఐలయ్య, పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, జగన్‌ను సన్మానించారు. ఈ పాఠశాల విద్యార్థులు తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని వాటర్ సంపును నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సమ్మేళనంలో నెల్లూరు, కాకినాడ, హైదరాబాద్, మంచిర్యాల, కరీంనగర్, ఏటూరునాగారం, ములుగు ప్రాంతాల్లో స్థిరపడిన వారు కలుసుకోవడం విశేషం. పరీబాల సుబ్బారావు, సత్య సుబ్రహ్మణ్యం, రమేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★Jangaon DTCP Open Plots Reasonable Price, Clear Title, Prime Location by: SSVPD'S. 7382126789.
NT-329249

PLOT FOR SALE
★వరంగల్ హైవే రఘునాథపల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563 WARANGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777135 MULUGU
9182777135 MAHABUBABAD
9182777557 JANGAON
9182777565

పది మూల్యాంకనంలో అడ్డగోలుగా విధుల కేటాయింపు

- విదేశాల్లో ఉన్న టీచర్‌కు విధులు
- కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికీ కేటాయింపు
- డీఈవో తీరుపై మండిపడుతున్న ఉపాధ్యాయులు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 13 : పది మూల్యాంకనం విధుల్లో విద్యాశాఖాధికారుల తప్పిదాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఏకంగా విదేశాల్లో ఉన్న టీచర్‌కు మూల్యాంకన విధులు కేటాయించడంతో డీఈవో నిర్లక్ష్యంపై ఉపాధ్యాయ వర్గాలు భగ్గుమంటున్నాయి. అంతేకాకుండా మూడేళ్ల నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టం వచ్చినట్లు విధులు కేటాయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం నుంచి కాజీపేటలోని ఫాతిమా గర్స్ హైస్కూల్‌లో పదో తరగతి మూల్యాంకనం ప్రారంభించారు. విధుల కేటాయింపులో అధికారులు చేసిన తప్పిదాలు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మూడేళ్ల బోధనానుభవం లేని ఉపాధ్యాయులకు మూల్యాంకన విధులు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, పది మూల్యాంకనంలో విదేశాల్లో ఉన్న ఉపాధ్యాయురాలికి విధులు కేటాయించడంపై ఉపాధ్యాయవర్గాలు మండిపడుతున్నారు. సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు గత నవంబర్ నుంచి సెలవుపై విదేశాల్లో ఉండగా, ఆమెకు మూల్యాంకన విధులు కేటాయించారు. పాఠశాల విధుల్లో ఉన్నవారికే మూల్యాంకన విధులు కేటాయించాల్సి ఉండగా, సెలవుపై విదేశాల్లో ఉన్న ఉపాధ్యాయురాలికి మూల్యాంకన విధులు కేటాయించడం అధికారుల పని తీరుకు పరాకాష్టగా నిలుస్తున్నది.

టిప్పర్లతో నిండిన రహదారి

స్కూటీని ఢీకొన్న టిప్పర్

నుజ్జునుజ్జయిన స్కూటీ.. వాహనదారుడికి గాయాలు

టిప్పర్ ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన స్కూటీ

వరంగల్,ఏప్రిల్ 13 : టిప్పర్లతో నగర జనం తిప్పలు పడుతున్నారు. భద్రకాళీ చెరువు పూడిక తీసిన మట్టి తరలిస్తున్న టిప్పర్లతో రోజుకో ప్రమాదం జరుగుతున్నది. ఆదివారం సాయంత్రం టి